క్లుప్తంగా

కూర్మనాథుని సన్నిధిలో డీపీఓ



భారతి సుచిత్రకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ

గార: విష్ణుక్షేత్రం కూర్మంలోని శ్రీకూర్మనాథున్ని జిల్లా పంచాయతీ అధికారి భారతి సుచిత్ర గురువారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం లక్ష్మీసన్నిధి, వైష్ణవీదుర్గ, తాబేళ్లపార్కును సందర్శించారు. క్షేత్ర మహాత్యాన్ని మురళీకృష్ణమాచార్యులు తెలియజేశారు. ఈవో జి.గురునాథరావు స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

ఆదిత్యుని సన్నిధిలో జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్



స్వామిసన్నిధిలో విజయభారతి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం అధికారులు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు సాంప్రదాయ స్వాగతం పలికారు. గోత్రనామాలతో పూజలు జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథుని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహత్యాన్ని వివరించారు. ఆమెతో పాటు ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ ఉన్నారు.

భగవద్గీత పారాయణతో ధర్మ ప్రవర్తన



హరనాథ్‌ను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: గీతాజయంతి ఉత్సవాలలో భాగంగా నగరంలోని ఉపనిషన్మందిరంలో గురువారం 'గీత–శరణాగత తత్పరత' అనే అంశంపై పైడి హరనాథ్ ప్రసంగించారు. గీతా పారాయణతో కర్తవ్య జ్ఞానం, ధైర్యం, సాహసం, ధర్మప్రవర్తన కలుగుతాయని చెప్పారు. భగవంతుడు విధించిన ధర్మాన్ని ప్రతిఒక్కరూ ఆచరించాలని, అదే భగవంతుడి ప్రార్థన అవుతుందన్నారు. అనంతరం వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో నిక్కు అప్పన్న, డి.వెంకటరావు, యర్నాగుల రమణారావు, దాసరి తవుడు, దండా సత్యారావు, వి.వి.నాగేంద్ర, ఉప్పు త్రినాథరావు, కల్యాణి, సరస్వతి, పుష్ప, రూప, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

మహిళలే సమాజ నిర్మాతలు



విజయభారతిని సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మహిళలు సమాజ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి అన్నారు. సేవాభారతి, జాతీయ మానవహక్కుల కమిషన్ సంయుక్తంగా మునసబుపేటలోని గురజాడ కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాయని వివరించారు. అనంతరం చైర్‌పర్సన్‌ను గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రంగారావు, ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి, ఏసీటీఓ రాణీమోహన్, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, రాష్ట్ర మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మహేష్, కెప్టెన్ వంగ మహేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం: జె.ఆర్.పురం పంచాయతీకి చెందిన విలేకరి శనపతి వరప్రసాద్ తండ్రి నరసింగరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీటీసీ పచ్చిగుళ్ల సాయిరాం, నాయకులు దన్నాన సీతారాం, ఇడదాసుల తిరుపతిరాజు, పిన్నింటి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఎచ్చెర్ల ఫీడర్, ఎస్ఎంపురం అనమిత్ర టౌన్‌షిప్, ఏపీ గురుకుల పాఠశాల ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.యోగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

హామీలే మిగిలె..!



- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా అమలు కాని 'సూపర్‌సిక్స్' హామీలు
- ఎన్నాళ్లీ ఎదురుచూపులని ప్రజల ఆవేదన



పొలాల్లోనే ధాన్యం కుప్పలు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల/రణస్థలం: అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ హామీలు అమలు చేస్తామని గొప్పలు ప్రకటించిన కూటమి నాయకులు.. గద్దెనెక్కాక హామీల సంగతే మర్చిపోయారు. తల్లి వందనం, రైతులకు పెట్టుబడి సాయం, ఉచిత బస్సు, 50 ఏళ్ల దాటితే పింఛన్, నిరుద్యోగ భృతి.. ఇలా ఏ ఒక్క హామీ కూడా నెరవేరకపోవడంతో ఆయా పథకాల ఆశావహులు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాల పరిధిలో 123 పంచాయతీలు, 100 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. 2.50 లక్షల వరకు జనాభా ఉన్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అమ్మకం చేపట్టేవారు. ప్రస్తుతం వాటి ఊసే లేదు. నియోజకవర్గంలో సుమారు 25,000 ఎకరాల్లో వరి సాగు చేశారు. 35 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు మాత్రం ముందుకుసాగటం లేదు. సుమారు 40 వేల మంది రైతు పెట్టుబడి సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో ఠంఛన్‌గా రైతు భరోసా సాయం అందేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను పూర్తిగా విస్మరించిందని పలువురు మండిపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 24 వేల మందికి తల్లికి వందనం పథకం అందాల్సి ఉంది. ఇంతవరకు పథకం విధి విధానాలు, ఎప్పుడు అమలు చేస్తామో ప్రకటించకపోవడంతో తల్లిదండ్రులపై ఫీజుల భారం పడుతోంది. నియోజకవర్గంలో సుమారు 12 వేల మంది ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. వేట నిషేధకాలంలో మత్స్యకార భరోసా సాయం చెల్లించాల్సి ఉన్నా ఆ పథకాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ సాయం కోసం సుమారు ఐదు వేల మంది మత్స్యకారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇక కొత్త పింఛన్లు, ఉచిత బస్సు సంగతి సరేసరి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలకు స్వస్తి పలికి హామీల అమలుపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



నాకు ఎకరన్న భూమి ఉంది. వరితో పాటు పలు రకాల పంటల సాగు చేస్తున్నాం. గత ప్రభుత్వంలో రైతు భరోసా రూ.13,500, ధాన్యానికి కనీస మద్దతు ధర ఇచ్చి ఆదుకున్నారు. పంటలు నష్టపోతే ఉచితంగా బీమా చేయించి ఆదుకున్నారు.మొక్కజొన్న, ధాన్యం కొనుగోలుకు గ్రామాల్లోకే ఆర్టీసీ బస్సుల పంపి బస్తాలు ఎక్కించి కొనుగోలు కేంద్రాలకు ఉచితంగా పంపించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రైతులను పూర్తిగా మరిచిపోయారు.

– చందక రామునాయుడు, పాతర్లపల్లి గ్రామం, రణస్థలం మండలం

హామీలు అమలు చేయాలి



ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి. ఆరు నెలలవుతున్నా ఇంతవరకు తల్లికి వందనం, ఉచిత బస్సు వంటి పథకాలకు విధి విధానాలు ప్రకటించకపోవడం తగదు.

– సనపల ఇందిర, ఇబ్రహింబాద్, ఎచ్చెర్ల మండలం

హామీల అమలు ఎప్పుడో?



తల్లికి వందనం, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, బీసీలకు 50 ఏళ్ల దాటితే పింఛన్, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, మత్స్యకార భరోసాఇలా ప్రతి హామీ అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైంది.

– నేతింటి యమున, పొన్నాడ సర్పంచ్, ఎచ్చెర్ల మండలం

రైతు భరోసా ఇచ్చేదెన్నడు?



గత ప్రభుత్వంలో రైతు భరోసా సమయానికి అందించేవారు. కూటమి పాలనలో పెట్టుబడి సాయం ఇస్తామని చెబుతున్నారు తప్ప కార్యరూపం దాల్చడం లేదు. దీంతో రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది.

– గొర్లె శ్రీరాములునాయుడు, మురపాక, లావేరు మండలం

కలెక్టరేట్ ర్యాలీకి రైతులంతా తరలిరండి



రణస్థలంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్, రైతులు

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వ పాలనలో రైతన్నలు పూర్తిగా కుదేలైపోయారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం(నేడు) జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయానికి నాలుగు మండలాల రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతన్నలకు అండగా గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు ఉండేవని, రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 సాయం అందేదని గుర్తు చేశారు. రైతుల చెంతకే వచ్చి ధాన్యం, మొక్కజొన్న వంటి పంటల కొనుగోలు, పంట నష్టం చెల్లింపు, బ్యాంకుల్లో సులభంగా వడ్డీ లేని రుణాలు వంటి సదుపాయాలు కల్పించారని చెప్పారు. నేటి కూటమి పాలనలో రైతులను విస్మరించారని మండిపడ్డారు. ఓవైపు అకాల వర్షాలతో రైతు నట్టేట మునిగిపోతే ధాన్యం కొనుగోలుకు షరతులు పెడుతుండటం భావ్యం కాదన్నారు. నారాయణపురం సాగునీటి కాలువ రాక పంటలు ఎండిపోతే ఏ ఒక్కరూ రైతన్నను ఆదుకోలేదన్నారు. ఎచ్చెర్లను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో రైతులకు ఉచితంగా తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేసి ఆదుకుంటే నేడు అదే రైతుల పొలాల్లో స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రకటించిన అన్నదాత పెట్టుబడి సాయం రూ.20వేలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ పచ్చిగుళ్ల సాయిరాం, ఉప సర్పంచ్ దన్నాన సీతారాం, మాజీ ఎంపీటీసీ ఇడదాసుల తిరుపతిరాజు, తెప్పలవలస సర్పంచ్ బొమ్మలాట శ్రీరాములు, మాజీ సర్పంచ్ జగ్గరోతు రాజారావు, నాయకులు పిన్నింటి సత్యంనాయుడు, దన్నాన హరి, బుడుమూరు ఎల్లారావు, తోట అప్పన్న, రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

గార: మండలంలోని నారాయణపురం, భైరి ఓపెన్‌హెడ్, వంశధార కుడి ప్రధాన కాలువ పరిధిలో శనివారం జరగనున్న ఎనిమిది నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల సమన్వయకర్త కాశిన క్రాంతికుమార్ గురువారం తెలిపారు. నారాయణపురం ఛానెల్ పరిధిలో వాడాడ, శ్రీకూర్మం సంఘాలకు ఆయా గ్రామాల్లోనే ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. వంశధార ఆర్ఎంసీ పరిధిలో అంపోలు-1, అంపోలు-2, శ్రీకూర్మం సంఘాలకు, భైరి ఓపెన్ హెడ్ ఛానెల్ పరిధిలో అంపోలు, వమరవల్లి, కొర్లాం సంఘాలకు ఆయా గ్రామాల్లో ఎన్నికలు జరుగుతాయని వివరించారు. ఒక్కో సంఘంలో 12 టీసీల ఎన్నిక తర్వాత, సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని తెలిపారు. నీటి తీరువా(పన్ను) చెల్లించిన రైతులే పోటీకి అర్హులని స్పష్టం చేశారు.

శాంతిస్థాపనకే ఏసుక్రీస్తు జననం



సమాజంలో శాంతి స్థాపనకే ఏసుక్రీస్తు జన్మించారని పాస్టర్ చల్లా విజయ్ అన్నారు. పాత్రునివలస టిడ్కో కాలనీలోని కల్వరి ప్రేయర్ టెంపుల్‌లో గురువారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కల్వరి క్వయిర్ బృందం భక్తి గీతాలు ఆలపించారు. కె.సూర్యనారాయణ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చల్లా ఎస్తేరు, పాస్టర్‌లు చల్లా కరుణాకరరావు, తిమోతి, తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

వేణుకు గద్దర్ జాతీయ పురస్కారం



బహుజనుల రాజ్యాంగ బద్ధమైన హక్కుల పరిరక్షణకు కృషి చేసినందుకు గాను జిల్లాకు చెందిన కంఠ వేణుకు గద్దర్ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. గురువారం కోనసీమ జిల్లా పి.గన్నవరంలో జరిగిన కార్యక్రమంలో వెన్నెల గద్దర్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. వేణుకు అవార్డు రావడం పట్ల పాటల తూటా ఉదయ్‌భాస్కర్, బహుజన నాయకులు కోళ్లపల్లి రామ్‌గోపాల్, తైక్వాండో శ్రీను, యజ్జల గురుమూర్తి, గంటాన అప్పారావు, బడియా కామరాజు, రాయి వేణుగోపాల్, బోనేల రమేష్ అభినందనలు తెలిపారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ప్రకృతి సేద్యంపై అవగాహన



ప్రస్తుత రబీ సీజన్‌లో డ్రై సోయింగ్ విధానంలో సాగుకు ప్రాధాన్యమివ్వాలని ప్రకృతి వ్యవసాయం రిసోర్సు పర్సన్ హేమసుందర్ అన్నారు. తమ్మినాయుడుపేటలో గురువారం డ్రై సోయింగ్ పద్ధతిపై అవగాహన కల్పించారు. కంది, ఆముదం, బొబ్బర, గోరు చిక్కుడు, చిరు ధాన్యాలు, మొక్కజొన్న, ఆకు కూరల సాగుపై దృష్టి సారించాలన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి



కరెంట్ బిల్లులు దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

రణస్థలం: విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ అమ్మన్నాయుడు, నాయకులు వెలమల రమణ డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రణస్థలం రామతీర్థాలు కూడలిలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన నాయకులు ఇప్పుడు మీటర్లు పెడుతుంటే ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్ మీటర్ పెట్టడం నమ్మకద్రోహమేనని మండిపడ్డారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతుందన్నారు. ముందుగా డబ్బు చెల్లించి రీచార్జ్ చేయించుకోవాలని, బ్యాలెన్స్ పూర్తి కాగానే సరఫరా నిలిచిపోతుందని, పేదలకు అంధకారమే మిగులుతుందని చెప్పారు. ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయాన్ని 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుంచే వసూలు చేయడం భావ్యం కాదన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఆదేశాలకు తలొగ్గకుండా కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి



ఐసీడీఎస్ కార్యాలయ అధికారి రామారావుకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్:అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్–హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. ఈ మేరకు అంగన్‌వాడీలకు 42 రోజుల సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలు వెంటనే అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జీవో ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోని ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో కార్యాలయ అధికారి కె.రామారావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పేరిట రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచడం సరికాదన్నారు. ఫోన్లు పని చేయడం లేదని, సెంటర్ నిర్వహణకు ఇవ్వాల్సిన బిల్లులు, అద్దెలు నెల నెల చెల్లించడంలేదని చెప్పారు. ఐదేళ్లుగా అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చినా ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకూ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, ఐదేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ సెంటర్లో ఉంచేలా జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు పి.లత, పి.భూలక్ష్మి, కె.వి.హేమలత, కె.లక్ష్మి, పి.పద్మాలత, ఎస్.శ్రీదేవి, జ్యోతి, అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి కాలభైరవ నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని బాలాత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఈ నెల 15నుంచి కాలభైరవ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఒక ప్రకటనలో తెలిపారు. 15న దత్త జయంతిని పురస్కరించుకుని దత్తాత్రేయునికి అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని, 15 నుంచి 25వ తేదీ వరకు కాలభైరవ దీక్షల్లో భాగంగా మాలధారణలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

సాయిరామ్‌కు అభినందనలు



సాయిరామ్‌ను సత్కరిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: ఆర్యవైశ్య సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నూతనంగా ఎన్నికైన జె.ఆర్.పురం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు పచ్చిగుళ్ల సాయిరామ్‌ను గురువారం ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం ఉప సర్పంచ్ దన్నాన సీతారాం, మాజీ ఎంపీటీసీ ఇడదాసుల తిరుపతిరాజు, నాయకులు, పిన్నింటి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుందర నగరమే లక్ష్యం



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ అన్నారు. గురువారం నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు, కొత్తపేట చిల్డ్రన్‌పార్కు, ఇందిరా ప్రియదర్శిని పార్కు, వుడాపార్కులతో పాటు పలు కాలనీలను సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కమిషనర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శికి సత్కారం



కె.వి.జి సత్యనారాయణను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా నియమితులైన కె.వి.జి.సత్యనారాయణకు పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి దుశ్శాలువతో సత్కరించారు. గురువారం శ్రీకాకుళం నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ పార్టీకోసం అంకిత భావంతో పనిచేస్తున్న సత్యనారాయణకు పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళింగ వైశ్య రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏపీ తపాలా శాఖ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ప్రకాష్

శ్రీకాకుళం అర్బన్: తపాలాశాఖ అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ తపాలాశాఖ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఓ హోటల్లో ఈ నెల 11, 12వ తేదీల్లో పోస్టల్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మెగా మేళా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల వ్యవధిలో సుమారు రూ.2 కోట్ల ప్రీమియంలు సేకరించి రాష్ట్రంలోనే శ్రీకాకుళం డివిజన్ ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు నిజాయితీ, అంకితభావంతో పనిచేసి లక్ష్యాన్ని పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. తపాలాశాఖ ద్వారా వివిధ రకాల ఖాతాలతో పాటు తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌తో జీవితబీమా, గ్రామీణ తపాలా జీవిత బీమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అత్యధిక ప్రీమియంలు సేకరించిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం తపాలాశాఖ సూపరింటెండెంట్ వందాన హరిబాబు, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్‌లు, తపాలా అధికారులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని మున్సిపల్ ఇంజినీరింగ్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్యామలరావు, సంతోష్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా 6వ రోజు గురువారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ శాఖ మంత్రి స్పందించి న్యాయమైన డిమాండ్లు తక్షణమే తీర్చాలని కోరారు. మున్సిపల్ శాఖలో కీలకమైన ఇంజినీరింగ్ సిబ్బంది సమస్యలపై చొరవ చూపకపోవడం శోచనీయమన్నారు. టెక్నిక్, నాన్ టెక్నిక్‌ల వారీగా రూ.29,200, రూ.24,500 జీతాలు అమలు చేయాలని, రిటైర్డ్ కార్మికులకు రూ.10లక్షలు ఇవ్వాలని, 15 ఏళ్ల సర్వీస్ దాటిన వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు జగన్, శ్రీను, రామారావు, సతీష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.